సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



కొనసాగుతున్న గురుకుల క్రీడలు
గుండాల మండల కేంద్రంలోగురుకుల పాఠశాలల ఏడో జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం రెండోరోజుకు చేరాయి. 10లో



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తోనే..
రానున్న ఎన్నికల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ కలిసి పోటీ చేయనున్నట్లు సీపీఐ నేత కూనంనేని తెలిపారు. 10లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం
34° / 23°

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే మంచు కురిసే అవకాశం ఉంది. ఆ తర్వాత ఎండ మొదలై క్రమంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష



గర్భిణితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష

దుమ్ముగూడెం : గర్భిణులకు, జ్వర పీడితులకు లోపాలు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష సూచించారు. శనివారం ఆమె దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. జ్వరం కేసుల తీవ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సెల్ కౌంటర్ మెషిన్‌ను మంజూరు చేసి సాయంత్రం వరకు ఆరోగ్య కేంద్రానికి పంపించేలా ఆదేశాలు జారీ చేశారు. మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్, డాక్టర్ పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

జేపీఎస్‌లకు రెండు వేతనాలు!
- 153 మంది ఖాతాల్లో నగదు జమ
- పొరపాటును గుర్తించి రీఫండ్‌కు చర్యలు చేపట్టిన అధికారులు

చుంచుపల్లి: కొందరు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లోకి శుక్రవారం రాత్రి తమకు రావలసిన జీతం కంటే అధిక మొత్తంలో నగదు జమైంది. దీంతో జేపీఎస్‌లు ఒక్కసారిగా అవాక్కయ్యారు. వాస్తవానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సెప్టెంబర్ వేతనం మాత్రమే పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని పూర్తి చేసిన పలువురు జేపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేస్తూ ఆర్డర్లు అందజేసిన విషయం తెలిసిందే. జిల్లాలో తొలి విడతలో గత ఆగస్టు 24న వంద మందికి గ్రేడ్- 4 కార్యదర్శులుగా అవకాశం కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 8న రెండో విడతలో మరో 153 మందికి రెగ్యులరైజేషన్ చేస్తూ ఆర్డర్లు అందజేశారు. ఈ క్రమంలో రెండో విడతలో ఆర్డర్లు పొందిన 153 మంది జేపీఎస్‌లకు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 7 వరకు జేపీఎస్ వేతనం, ఎనిమిదో తేదీ నుంచి 30 వరకు గ్రేడ్-4 కార్యదర్శి వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే వీరందరికీ సెప్టెంబర్ నెల మొత్తానికి జేపీఎస్ వేతనం రూ.28.719తోపాటు 23 రోజులకు గ్రేడ్-4 కార్యదర్శి వేతనం రూ.23,559 మొత్తం కలిపి రూ. 52,278 జమయ్యాయి. ట్రెజరీలోనే పొరపాటు జరిగి ఇలా రెండు వేతనాలు పడి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. కాగా సోమవారం ఒక వేతనాన్ని ట్రెజరీ సీపీఆర్ చలానా ద్వారా తిరిగి చెల్లించాలని జేపీఎస్‌లకు అధికారులు సమాచారం అందించినట్లు తెలిసింది.

రిటైర్డ్ క్లర్క్‌లను తిరిగి నియమించొద్దు
సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో రిటైర్డ్ క్లర్క్‌లను తిరిగి నియమించుకోవటం నిలుపుదల చేయాలని, అర్హులైన కార్మికులకు క్లర్క్‌లుగా నియమించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ విరమణ పొందిన క్లర్క్‌లకు ఒక్కొక్కరికి నెలకు రూ. 30 వేలు చెల్లిస్తూ హైదరాబాద్ సింగరేణి భవన్ గెస్ట్‌హౌస్‌లో నియమిస్తున్నారని ఆరోపించారు.

పూల సంబరం షురూ..

ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- ఆటపాటలతో మార్మోగిన జానపద గీతాలు



టేకులపల్లిలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు, మహిళలు (ఇన్‌సెట్) ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ కోలాటం





కొత్తగూడెంలో బతుకమ్మ సందడి

కొత్తగూడెంటౌన్: జిల్లావ్యాప్తంగా శనివారం బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నా పెద్ద తేడాలు లేకుండా ఆడిపాడారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే వేడుకలు కావడంతో గ్రామాలు, బస్తీలు, చౌరస్తాలు సందడిగా మారాయి. జిల్లా కేంద్రంతోపాటు పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కొత్తగూడెంలో రైటర్‌బస్తీ, బస్టాండ్ ఏరియా, సూపర్‌బజార్, గణేష్‌టెంపుల్, ఓల్డ్ బస్టాండ్, మధురబస్తీ, మేదరబస్తీ, హనుమాన్‌బస్తీ, రామవరం, వనందాస్‌గడ్డబస్తీ, హెడ్ ఆఫీస్ ఏరియా, పాత కొత్తగూడెం, విద్యానగర్ కాలనీ, పాత కొత్తగూడెం, రుద్రంపూర్, గౌతంపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను చేబూని.. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు కదలి రాగా వీధులు శోభాయమానంగా మారాయి. ఊరేగింపుగా ఆలయాలకు, చౌరస్తాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. చిత్తూ చిత్తూల బొమ్మ.., శివుడీ ముద్దుల గుమ్మ.. తదితర జానగీతాలతో హోరెత్తించారు. తంగేడు, బంతి, గోరింటా, గులాబీ తదితర పూలతో బతుకమ్మలను పేర్చారు. తొలుత ఇళ్ల ముందు వాకిళ్లలో ఉంచి చుట్టూ చేరి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

మరిన్ని చిత్రాలు 11లో..

బెర్త్‌లు ఖరారు..!
- ఖమ్మంలో తుమ్మల.. పాలేరుకు పొంగులేటి
- కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్‌తో సస్పెన్స్‌కు తెర
- ఇప్పటికే మధిరలో భట్టి, భద్రాచలంలో వీరయ్య ఫైనల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) కసరత్తు తుది దశకు చేరింది. ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే సస్పెన్స్‌కు దాదాపుగా తెర పడింది. పాలేరు నుంచి పొంగులేటి, ఖమ్మం నుంచి తుమ్మలను బరిలోకి దించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈమేరకు తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీలో శనివారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పాలేరుతో ఉన్న అనుబంధం తెలిసినప్పటికీ పార్టీ బలోపేతానికి ఖమ్మం నుంచి బరిలో దింపాలని నిర్ణయించినట్లు చెప్పగా... అధిష్టానం నిర్ణయాన్ని పాటిస్తానని తుమ్మల బదులిచ్చారు. ఇక మధిర, భద్రాచలంలో సిట్టింగ్‌లైన సీ ఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, పొదెం వీరయ్యనే ఖరారు చేసినట్లు తెలిసింది. దీంతో నేడో, రేపో ప్రకటించే పార్టీ తొలి జాబితాలో ఉమ్మడి ఖమ్మం నుంచి నాలుగు స్థానాలకు స్థానం దక్కనుంది.

ఖమ్మంలో మూడోసారి తుమ్మల

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నుంచి బరిలో దిగనుండడం ఇది మూడోసారి అవుతుంది. ఆయన పాలేరు టికెట్ ఆశించినప్పటికీ సామాజిక సమీకరణాల నేపథ్యాన అధికార పార్టీకి దీటుగా ఖమ్మం నుంచే పోటీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌లో పాలేరు టికెట్ ఆశించి భంగపడిన ఆయన గత నెల 16న కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాలేరు టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించినా ఖమ్మం నుంచి పోటీకే అధిష్టానం మొగ్గుచూపింది.

పాలేరు బరిలో పొంగులేటి

ఈ ఏడాది జనవరి 1న బీఆర్‌ఎస్‌పై నిరసన గళం విప్పిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఆతర్వాత పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. జూలై



2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించి తన అనుచరులతో కలిసి రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్ గూటికి చేరారు. పాలేరు, ఖమ్మం, కొత్తగూడెంల్లో ఓ చోట నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరిగినా... పాలేరులో అధికార పార్టీ అభ్యర్థి సామాజికవర్గ నేపథ్యం ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం అక్కడి నుంచే పోటీకి దింపుతున్నట్లు తెలుస్తోంది.

ఆ రెండూ సిట్టింగ్‌లకే..

ఉమ్మడి జిల్లాలోని మధిరలో మల్లు భట్టి విక్రమార్క, భద్రాచలంలో పొదెం వీరయ్య ఎమ్మెల్యేలుగా కొనసాగుతుండగా.. మళ్లీ ఇప్పుడు కూడా వారి పేర్లనే ఖరారు చేశారు. వామపక్షాలతో పొత్తుపై చర్చలు జరుగుతుండగా, ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ఆ పార్టీలకు ఒకటి, రెండు స్థానాలను ఇస్తారనే ప్రచారం జరిగింది. గతంలో తాము ప్రాతినిధ్యం వహించిన భద్రాచలం, పాలేరు స్థానాలు ఇవ్వాలని సీపీఎం పట్టుబట్టినా పాలేరు నుంచి పొంగులేటి అభ్యర్థిత్వం ఖరారు కాగా.. భద్రాచలం సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ వదులుకోవడానికి సుముఖత చూపలేదని తెలిసింది. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే వీరయ్యనే ఫైనల్ చేసినట్లు సమాచారం.

మిగతా స్థానాలపై ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలకు గాను నాలుగు స్థానాల అభ్యర్థులను తొలి జాబితాలోనే కాంగ్రెస్ ప్రకటించనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు స్థానాల్లో సర్వేలు నివేదికలు, ఆశావహుల సత్తా ఆధారంగా కసరత్తు జరుగుతోంది. అయితే, ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న భట్టి, పొంగులేటి అనుచరులు ధీమాగా ఉన్నారు. కొత్తగూడెంపై మాత్రం సస్పెన్స్ వీడలేదు. ఇక్కడ బీసీ అభ్యర్థిని బరిలో దింపుతారా.. పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తారా.. అనేది తేలాల్సి ఉంది.

కిన్నెరసానిలో కలెక్టర్ ఆటవిడుపు

పాల్వంచరూరల్: విధి నిర్వహణలో క్షణం తీరిక లేకుండా గడిపే కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శనివారం సాయంత్రం కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి డీర్ పార్కులో దుప్పులను, పర్యావరణ కేంద్రంలోని జంతువుల బొమ్మలను వీక్షించారు. జలాశయంలో బోటు షికారు చేశారు.



పర్యావరణ కేంద్రంలో జంతువుల బొమ్మలను వీక్షిస్తున్న కలెక్టర్ ప్రియాంక

రాజకీయ కుట్రలే అభివృద్ధికి ఆటంకం
- ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం: కొన్ని రాజకీయ పార్టీల కుట్రలు, బూర్జువా ఆలోచనలతోనే భద్రాచలం అభివృద్ధికి ఆటంకం ఏర్పడిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. శనివారం పట్టణంలోని నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల కుట్రలు, కుతంత్రాలతో దళిత బంద్, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పండుగలకు మాత్రమే భద్రాచలం వచ్చే దసరా బుల్లోళ్లు మనకొద్దని, అలాంటి ఎమ్మెల్యే వల్ల భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు ఒనగూరు ప్రయోజనం ఏమి లేదని అన్నారు. స్థానికంగా నివాసం ఉండే అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేశాక గోదావరి ముంపునకు శాశ్వత పరిష్కారం ఉంటుందని అన్నారు. అప్పటివరకు రూ.38 కోట్లతో కరకట్ట పొడిగింపు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి తెల్లం వెంకట్రావు, మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు, తిప్పన సిద్దులు, బొలిశెట్టి రంగారావు, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అమ్ముడుపోయిన రేగాకు విమర్శించే అర్హత లేదు
- పార్టీలు మారిన తెల్లం వెంకట్రావును ప్రజలు నమ్మరు
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

భద్రాచలం: కాంగ్రెస్ పార్టీలో గెలిచి డబ్బులకు అమ్ముడుపోయి నైతికంగా నీచ రాజకీయాలు చేస్తున్న రేగా కాంతారావుకు తనను విమర్శించే అర్హత లేదని భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య పేర్కొన్నారు. శనివారం భద్రాచలంలో రేగా కాంతారావు చేసిన వ్యాఖ్యలపై పరుష పదజాలంతో విరుచుకుపడ్డారు. తాను నిత్యం ప్రజల్లో ఉంటూ, భద్రాచలం సమస్యలపై పోరాడుతున్నానని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం, జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ భద్రాచలానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 'నువ్వే గెలిచే పరిస్థితి లేదు కానీ భద్రాచలం వచ్చి గెలిపించే వాడివా? అని రేగాను ప్రశ్నించారు. ఒళ్లు దగ్గరబెట్టుకొని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక కాంతారావు అవినీతి అక్రమాలతో కూడబెట్టిన రూ. కోట్లను బయటకు తీయిస్తామని హెచ్చరించారు. పలు పార్టీలు మారిన, టైమ్‌పాస్ రాజకీయాలు చేసే తెల్లం వెంకట్రావును ప్రజలు నమ్మరని అన్నారు. భద్రాచలంలో కాంగ్రెస్సే గెలుస్తుందన్నారు. టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, నాయకులు రవికుమార్, బోగాల శ్రీనివాసరెడ్డి, సరెళ్ల నరేష్, అడబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అడిషనల్ డీఆర్‌డీఓగా రవి
చుంచుపల్లి: జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిగా ఎస్.రవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం హనుమకొండ జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు. రవి గతంలో దమ్మపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఎంపీడీఓగా పని చేశారు. అడిషనల్ డీఆర్‌డీఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా కలెక్టర్ ప్రియాంక అలను మర్యాదపూర్వకంగా కలిశారు.



పాల్వంచరూరల్: విద్యుత్ కాంతులతో మిరిమిట్లు గొలుపుతున్న పెద్దమ్మతల్లి ఆలయం 10లో

క్లుప్తంగా

కొనసాగుతున్న గురుకులాల క్రీడలు

ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

గుండాల: గురుకుల పాఠశాలల ఏడో జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం రెండోరోజుకు చేరాయి. గుండాల మండల కేంద్రంలో గురుకులంలో జరుగుతున్న పోటీలకు ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి 18 పాఠశాలలు, కళాశాలల నుంచి 700 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. అండర్–14, 17, 19 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తుండగా నువ్వా, నేనా అన్నట్లు సత్తా చాటుతున్నారు. కాగా, శనివారం సెమీ ఫైనల్స్ జరగగా, ఆదివారం పోటీలు ముగియనున్నాయని ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. అధికారుల సూచనల మేరకు విద్యార్థులు ఇబ్బంది పడకుండా వసతి, భోజన వసతులు సమకూర్చడమే కాకుండా గాయపడిన వారికి చికిత్స కోసం వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు.

రూ.2లక్షల నగదు స్వాధీనం



నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఐ కార్తీక్

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామం పెద్దమ్మగుడి సమీపంలోని జాతీయ రహదారిపై రూరల్ ఎస్‌ఐ కార్తీక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా ములుగు జిల్లా పేరూరుకు చెందిన సుధాకర్ రూ.లక్ష తరలిస్తూ పట్టుబడ్డాడు. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

జగదాంబగుంపులో రూ.లక్ష...

ఇల్లెందురూరల్ : మండలంలోని జగదాంబ గుంపు గ్రామంలో ఫెర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ రూ.లక్ష నగదుతో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో నిర్వహించిన వాహన తనిఖీల్లో అతని వద్ద ఉన్న నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసు శాఖ స్పెషల్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకున్నారు.

మావోయిస్టు పార్టీ డిప్యూటీ కమాండర్ అరెస్టు



పట్టుబడిన మావోయిస్టు కొర్సాతో పోలీసులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో శనివారం మహారాష్ట్ర పోలీసులు చేపట్టిన తనిఖీల్లో మావోయిస్టు ముఖ్య నేతను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నారాయణపూర్–కాంకేర్ జిల్లాల సరిహద్దు ప్రాంతం(మహారాష్ట్ర సరిహద్దు)లో మావోయిస్టు పార్టీ డివిజనల్ కమిటీ మెంబర్, డిప్యూటీ కమాండర్ చైనూరం అలియాస్ సుక్కు అలియాస్ వట్టి కొర్సా సంచరిస్తున్నాడనే సమాచారంతో కూంబింగ్ చేపట్టారు. ఈక్రమంలో జరవండి – సోహగాన్ మధ్య అటవీ ప్రాంతంలో కొర్సా పట్టుబడగా వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో హత్యలు, మందుపాతర పేల్చివేతలు, పోలీస్ స్టేషన్లపై దాడి కేసులు ఆయనపై ఉండగా, ప్రభుత్వం రూ.16లక్షల రివార్డు ప్రకటించింది.

భూ కబ్జాలు చేస్తున్నారు..



మాట్లాడుతున్న బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేశ్

కొత్తగూడెంఅర్బన్: నాలుగున్నర ఏళ్లుగా అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన తనయుడు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అనుచరులు భూకబ్జాలు, అవినీతి, అరాచకాలు చేస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేశ్ ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో కుమ్ములాటలు ఉండగా, కమ్యూనిస్టులకు ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఆదరించాలని, కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కార్యకర్తలు పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, సాయి, నిరంజన్ కుమార్, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

కరుణించు కనకదుర్గమ్మ..

నేటి నుంచి 'దేవీ శరన్నవరాత్రోత్సవాలు'

- తొమ్మిది రోజులు.. తొమ్మిది రూపాల్లో అమ్మవారి దర్శనం
- తొలిరోజు ఆదిలక్ష్మిగా అమ్మవారి అవతారం
- 24 వరకు కొనసాగనున్న ఉత్సవాలు
- విద్యుత్‌కాంతులతో శోభిల్లుతున్న ఆలయాలు



విద్యుత్‌దీపాలతో పెద్దమ్మతల్లి ఆలయం,(ఇన్‌సెట్) మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

భద్రాచలం/పాల్వంచరూరల్: దసరాకు వారం రోజుల ముందు ప్రతీ ఏడాది నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. నేటి నుంచి 24వ తేదీ వరకు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తూ విశేష పూజలు అందుకోనున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయాల్లో ప్రతీ రోజు వేదపండితులు, అర్చకులు అమ్మవారికి శ్రీచక్రార్చన, వేద పారాయణం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష కుంకుమార్చన, రుద్రహోమం, చండీహోమం, సప్తశతి పారాయణ, అనుష్టానం వంటి పూజలు జరపనున్నారు. అనంతరం విజయదశమి(దసరా) రోజున మండపాల్లో శమీ, ఆయుధ పూజ, శ్రీ రామలీలా మహోత్సవాలను ఘనంగా జరిపేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజుకో అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనుండగా.. వేడుకలు నిర్వహించేందుకు భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం, పాల్వంచ రూరల్ మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయాలు ముస్తాబయ్యాయి. కాగా, రామాలయంలో ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవం, మధ్యాహ్నం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం చిత్రకూట మండపంలో శ్రీరామాయణ ప్రవచనము, తిరువీధి సేవ, ఇతర ప్రత్యేక పూజలను జరపనున్నారు. అలాగే పెద్దమ్మ తల్లి ఆలయంలో నేడు ఉదయం 9.35 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ, కలశపూజలు నిర్వహించనున్నారు.

తొమ్మిది రూపాల్లో అమ్మవారు..

శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు తొలిరోజు శ్రీ బాల త్రిపుర సుందరీదేవి(ఆదిలక్ష్మి) రూపంలో, 16న శ్రీగాయత్రీదేవి(సంతానలక్ష్మి) రూపంలో, 17న శ్రీ అన్నపూర్ణాదేవి(గజలక్ష్మి) అవతారంలో, 18న శ్రీలలితా త్రిపురసుందరీదేవి(ధనలక్ష్మి) రూపంలో, 19న శ్రీ లక్ష్మీదేవి(ధాన్యలక్ష్మి) రూపంలో, 20న శ్రీ సరస్వతీదేవి(విజయలక్ష్మి) అలంకరణలో, 21న శ్రీ దుర్గాదేవి(ఐశ్వర్యలక్ష్మి) రూపంలో, 22 శ్రీ మహిషాసుర మర్దనీదేవి(వీరలక్ష్మి) రూపంలో, 23న శ్రీ రాజరాజేశ్వరీదేవి(మహాలక్ష్మి) అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఆదిలక్ష్మి అలంకరణ విశిష్టత..

తొలిరోజు ఆదిలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్న నేపథ్యాన భగవంతుని గుర్తించడానికే ఆలంబమైన లక్ష్మీతత్వాన్నే ఆదిలక్ష్మి అంటారని, ఆ అమ్మవారి వల్లే వేదవేద్యుడిని గుర్తించగలిగారని శ్రీ పరాశర భట్టార్ పేర్కొన్నారు. చతుభుజాలతో పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద–అభయ హస్తాలతో విరాజిల్లుతూ అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు.

పూజలకు ఆలయం ముస్తాబు..



శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగులు వేయించి, విద్యుత్ దీపాలతో అలంకరించి శోభయమానంగా ముస్తాబు చేశాం. మహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ముద్రించి, రథం ద్వారా ఉమ్మడి జిల్లాలో విస్తృత ప్రచారం చేశాం. 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే వివిధ రకాల పూజలకు భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కాగలరు. – ఎన్.రజనీకుమారి, పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ.

క్రీడల్లోనూ రాణించాలి

కొనసాగుతున్న గురుకులాల 'జోనల్' స్పోర్ట్స్



చెస్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌సీఓ ప్రత్యూష

ములకలపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గురుకులాల స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మణ్ సూచించారు. ములకలపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కాలేజీలో జరుగుతున్న 9వ లెవెల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పోటీలను తిలకించిన ఆయన మాట్లాడారు. గురుకులాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటాలని ఆకాంక్షించారు. కాగా, గురుకులాల ఆర్‌సీఓ ప్రత్యూష శనివారం సాయంత్రం స్పోర్ట్స్ మీట్‌ను సందర్శించారు. చెస్ అండర్–19 విభాగం నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన పాలకుర్తి సుధాశ్రీ(అడవిమల్లెల), దర్శి దివ్య(ఖమ్మం), అండర్ – 17లో శ్రీకళ(నేలకొండపల్లి), సత్యకౌశిక(దానవాయిగూడెం), అండర్–14లో జి.హర్షిత (అడవిమల్లెల), లేఖన(పాల్వంచ) మొదటి రెండు స్థానాల్లో నిలవగా బహుమతులు అందజేశారు. కాగా, పోటీలకు హాజరైన విద్యార్థులు ప్రాంగణంలోనే బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ సునీత, ఆర్‌ఎస్‌ఓ శ్రీదేవి, చెస్ కోచ్ గోపీకృష్ణ, చెస్ ఇన్‌చార్జ్ త్రిపుర తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తోనే కలిసి ముందుకు..

- కొత్తగూడెం నుంచి పోటీలో ఉంటాం
- గెలుపోటములు శాసించేది కమ్యూనిస్టులే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేయనున్నారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది స్థానాలను తమ కూటమి కై వసం చేసుకుంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శనివారం ఏర్పాటుచేసిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గెలుపోటములను శాసించే శక్తి కమ్యూనిస్టులకే ఉందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో పోటీలో ఉండి తీరతామని స్పష్టం చేశారు. దేశ సమగ్రత, సమైక్యతకు విఘాతం కలిగిస్తున్న బీజేపీతోపాటు ఆ పార్టీతో చీకటి ఒప్పందాలు చేసుకునే బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గారడీ మాటలతో ప్రజలను మభ్యపెట్టడంలో కేసీఆర్ దిట్ట అని, ఇప్పటికే వివిధ పథకాల పేరుతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మారగా.. ప్రజల పక్షాన ప్రశ్నించే వారే లేకుండా పోయారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషాతోపాటు నాయకులు బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, బందెల నరసయ్య, గుత్తుల సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, సారయ్య, ఎస్‌డీ సలీం, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బిల్లుడుతండా పంచాయతీ పానుగోతుతండాకు చెందిన లకావత్ రాములు శనివారం రాత్రి తన ఇంటి నుంచి కిరాణం షాపుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ప్రధాన రహదారి దాటుతుండగా అదే సమయాన కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో రాములుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు, కుటుంబీకులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

దూషించిన ఐదుగురిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని దారేడుకు చెందిన ఐదుగురిపై శనివారం రాత్రి ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ గ్రామానికి చెందిన పుచ్చకాయల కమలాకర్, బత్తిని సీతారాములు, చాగంటి అశ్వత్థామ, నూర్ సామాషుద్దీన్, షేక్ జిలానీ ఎలాంటి అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి ఇతరులపై వ్యక్తిగత దూషణలు చేశారు. ఈ విషయమై అధికారులు వీడియో ఆధారంగా విచారణ చేపట్టడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

మావోయిస్టుల వద్దకు తీసుకెళ్తూ పట్టుబడిన ముగ్గురు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పంకజ్

భద్రాచలంటౌన్: మావోయిస్టులకు అందజేసేందుకు తీసుకెళ్తున్న పేలుడు పదార్థాలను భద్రాచలం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం.. భద్రాచలం బస్టాండ్‌లో తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారి వద్ద పరిశీలించగా మూడు సంచుల్లో పేలుడు పదార్థాలు లభించాయి. చర్ల మండలం నాయకుల కొత్తూరుకు చెందిన గుంజి విజయ్, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన బొంత నవీన్, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం బడితండాకు చెందిన భూక్యా నవీన్‌గా వీరిని గుర్తించారు. నిందితుల్లో విజయ్ ఐదేళ్లుగా మావోయిస్టులకు కొరియర్‌గా పనిచేస్తూ వారికి కావాల్సిన పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్నాడు. ఆయనకు మహబూబాబాద్ జిల్లా శనిగపురం గ్రామంలో తిరుమల ఏజెన్సీ పేరిట షాపు నడుపుతున్న బొంత నవీన్, భూక్యా నవీన్ విక్రయించేవారు. ఈ క్రమంలోనే మావోలకు పేలుడు పదార్థాలతో పాటు పత్రికా ప్రకటనల ప్రతులను అందజేసేందుకు వెళ్తున్న వారు పోలీసులకు చిక్కారు. కాగా, వీరి నుంచి ఆరు బండిళ్ల కార్డెక్స్ వైర్, పది జిలెటిన్ స్టిక్స్, ఐదు డిటోనేటర్లు, మూడు ఫోన్లతోపాటు మావోయిస్టు పార్టీ నోట్ షీట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఈసమావేశంలో సీఐ నాగరాజు రెడ్డి, ఎస్‌ఐ ఏ.వీ.రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక, మట్టి తరలిస్తున్న లారీల పట్టివేత



పోలీసులకు పట్టుపడిన లారీలు

పాల్వంచరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు ఇసుక, మట్టి తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమ్మగుడి సమీపంలోని బీసీఎం జాతీయ రహదారిపై శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఒక లారీలో ఇసుక, మరో లారీలో మట్టిని తరలిస్తున్న రెండు లారీలను ఆగి ఆరా తీయగా.. లారీల డ్రైవర్లు ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో ఆ లారీలను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాల్వంచ: గుర్తు తెలియని వ్యక్తి స్పృహతప్పి పడిపోగా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని దమ్మపేట సెంటర్ వద్ద శనివారం 45 ఏళ్ల వయసు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు 5.12 సెంటీమీటర్ల ఎత్తు, బూడిద రంగు మీద ఎర్ర గల్లా చొక్కా, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతి మీద సుగుణ, నాని, తిమోతి అనే పేర్లు పచ్చబొట్టు వేసి ఉన్నాయని, వ్యక్తి సంబంధీకులు వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: అల్లుడిపై మామ దాడి చేసే క్రమంలో అడ్డుగా వచ్చిన ఓ వృద్ధురాలికి గాయమైంది. దీంతో పోలీసులు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి జగన్నాథపురం గ్రామానికి చెందిన జాటోతు కృష్ణ జగ్గుతండాకు చెందిన తులసిని మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. కాగా ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లగా.. శనివారం కృష్ణ మామ గుగులోతు రాము అల్లుడు ఇంటికి వచ్చాడు. తర్వాత ద్విచక్రవాహన విషయంలో మామా అల్లుడికి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా అల్లుడిపై మామ దాడి చేసే క్రమంలో అడ్డుగా వచ్చిన కృష్ణ నానమ్మ సోనాకు గాయమైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాముపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

పూరిల్లు దగ్ధం

మణుగూరు టౌన్: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై ఓ పూరిల్లు దగ్ధమైన సంఘటన మణుగూరులోని సంతోష్‌నగర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ముత్యాలమ్మనగర్ పంచాయతీలోని సంతోష్‌నగర్‌కు చెందిన గుగులోత్ రాములు తన భార్యతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యాన శుక్రవారం యథావిధిగా ఇంటికి వచ్చి నిద్రిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పూరిల్లుకి మంటలు అలుముకొని దగ్ధమైంది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు కానీ ఇంట్లోని సామన్లు అగ్నికి ఆహుతయ్యాయి.

యువకుడిని బలితీసుకున్న ఆన్‌లైన్ బెట్టింగ్

అప్పులు ఎక్కువై ఆత్మహత్య

తిరుమలాయపాలెం: ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లతో అప్పుల పాలైన ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని బచ్చోడుకు చెందిన ఎన్నెబోయిన వెంకన్న, ఉప్పమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు దేవకుమార్ (23) ఉండగా.. కుమారుడు అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి ప్రస్తుతం కాకరవాయిలోని ఓ మందుల షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడే ఆయనకు అప్పులు పెరగగా తండ్రికి తెలిసి మందలించాడు. అయినా బెట్టింగ్‌లో పాల్గొన్న ఆయన డబ్బు కోల్పోయాడు. దీంతో పెరిగిన అప్పులు తీర్చలేక మూడు రోజుల నుంచి షాపునకు వెళ్లని దేవకుమార్.. శుక్రవారం మధ్యాహ్నం బచ్చోడుతండా సమీపంలోని తానంచర్ల కాల్వ వద్ద గడ్డి మందు తాగి పడిపోయాడు. ఆయనే విషయాన్ని స్నేహితులకు ఫోన్‌లో చెప్పగా కుటుంబీకులు చేరుకుని ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అయితే, సెల్‌ఫోన్ లాక్ రాకపోవడంతో పూర్తి సమాచారం తెలియలేదు. కానీ కుటుంబీకులు మాత్రం అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహిళతో కలిసి ఆత్మహత్యాయత్నం..

తిరుమలాయపాలెం: ఓ మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తికి మనస్పర్థలు రావడంతో ఎలుకల మందు తాగగా ఈ నెల 6న మహిళ మృతి చెందింది. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశాడు. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన షేక్ బాషా(36)కు వివాహమై పిల్లలు ఉన్నారు. దమ్మాయిగూడెంకు చెందిన ఆయన సమీప బంధువు అయిన వివాహితతో ఖమ్మంలో ఉంటూ ఆయన సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరి నడుమ వివాదం జరగడంతో ఇద్దరూ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ నెల 6న మహిళ మృతి చెందగా బాషా శనివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పిండిప్రోలు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, వివాహేతర సంబంధం రెండు కుటుంబాల్లో విషాదం నింపగా.. పిల్లలను అనాథలుగా చేసింది.